# అనుబంధాలు

- ఎ. అన్నపూర్ణ (యానీ)

చదువుతున్న పుస్తకం మూసి పారిజాత, తన రూమ్‌లోకి వెడుతూ ఫణి చక్రవర్తి నిద్రపోతున్న రూమ్ తలుపులు ఒకసారి నెట్టి, ఆయన మెలకువగా లేరని తెలుసుకుని, తన బెడ్‌మీద ఒరిగింది. ఫణి నిద్రరాకపోతే లేచి, డాబా మీద కూర్చుంటాడు. అప్పుడు పారిజాత కాసేపు ఆయన మనసుకు నచ్చిన కబుర్లు చెప్పి, ఆయన తన రూమ్‌లోకి వెళ్ళి, నిద్రపోయే వరకూ చూసి, అప్పుడు తన పడుకుంటుంది. రోజూ ఆమె చేసే డ్యూటీ!

కానీ ఆ రోజు ఫణి నిద్రపట్టక పోయినా, డాబా మీదకు వెళ్ళలేదు. నా గురించి ఆమె నిద్ర పాడు చేయడం ఎందుకని అనుకున్నాడు! అంతేకాదు. పారిజాతని ఒక విషయం గురించి అడగాలని చాలా రోజులుగా ఎదురు చూస్తు న్నాడు. అతడికి రెండు సంవత్సరాలుగా ఆమె సేవ చేస్తూ వచ్చింది. తల్లి మరణించాక, తండ్రిని, తన దగ్గరకు వచ్చి వుండమన్నా అంగీకరించక పోతే, విదేశాల్లో వున్న విష్ణు ఈ ఏర్పాటు చేసి వెళ్ళాడు.

పారిజాత వారికి బంధువు కాదు. కేవలం బ్రతుకు తెరువు కోసం, డబ్బు అవసరంతో తెలిసిన వారి ద్వారా, కేర్ టేకర్‌గా వచ్చింది. వచ్చిన రోజు నుంచీ ఫణి చక్రవర్తిని కంటిరెప్పలా చూసు కోవడం, సహనంతో సేవలు చేయడం, అనవసర విషయాలు కలుగ చేసుకోకుండా, హుందాగా వుండడం ఆమెలోని సుగుణాలు.

కళ్ళు మూతలు పడుతున్నా విచిత్రంగా పారిజాతకు ఫణి నిద్రపోవడం అనే ఆలోచన వచ్చి, దిగ్గున లేచి, మళ్ళీ అతని రూమ్‌లోకి వెళ్ళింది. అప్పుడు ఆమెను చూసిన ఫణి, లేచి కూర్చున్నాడు.

"చెప్పండి! ఇంతకాలంగా పరిచయం వున్నా నా దగ్గిర మొహమాటం ఎందుకు? నిద్రరావడం లేదా? ఏం ఈరోజు ఆరోగ్యం ఎలా వుంది? డాబా పైకి పోలేదా? ఆప్యాయంగా అడిగింది.

"పారిజాతా! రా... ఇలా వచ్చి ఈ కుర్చీలో కూర్చో. ఆరోగ్యం బాగానే వుంది. కానీ... ఏవో ఆలోచనల్లతో నిద్ర రావడం లేదు. నువ్వు నాసేవ చేయడానికే వచ్చినా, నీకు జీతం ఇస్తున్నా, నీ కష్టం నేనూ గ్రహించుకోవాలి కదా? నీతో మాట్లాడాలని ఇలా ఇక్కడే వుండి పోయాను. పారిజాతా! నువ్వు ఈ ఇంటికి వచ్చి, రెండు సంవత్సరాలు అయింది. ఆరోజు నుంచీ ఈరోజు వరకు నామీద చూపించే శ్రద్ధ, అభిమానంలోనూ ఏ మాత్రమూ ఆవగింజంత తేడాలేదు. అందుకే విష్ణు కూడా నిశ్చింతగా ఉన్నాడు. నువ్వు కనుక లభించకపోయి వుంటే, నేనూ తప్పనిసరిగా, విష్ణు దగ్గరికి వెళ్ళాల్సి వచ్చేది.

"జాతా! నువ్వు శాశ్వతంగా ఇక్కడే వుండి పోవాలి. అందుకు నీకో అర్హత, అవసరం కల్పించాలి. అందుకే నీ అనుమతి తీసుకోవాలని అనుకుంటున్నాను. నువ్వీ ఇంటి గృహిణివి కావాలి..." అన్నాడు ఫణి.

"ఫణి బాబూ! ఏదో ఒకరోజు మీరీ మాట అంటారని నాకు తెలుసు. అందుబాటులో వున్నా, అవకాశం వున్నా, మీరు ఏనాడూ నా పట్ల చొరవగా ప్రవర్తించలేదు. నిజానికి అందుకే ఈ రెండు సంవత్సరాల పాటూ, మీ దగ్గర నిశ్చింతగా వుండగలిగేను. నేనొక అతి సామాన్యమైన పిచ్చి పూల తీగను. దృఢమైన, విశాల వృక్షం పరిసరాల్లో ఠీవిగా వుండే, ఆసరా కోరుకోకుండా వుండలేను. అయితే రెండు సంవత్సరాల కాలంలోనే మీకు నా మీద అంత నమ్మకం కుదిరిందా? డబ్బు అవసరంతో నర్సింగ్ చేసే మనిషి, మీకు భార్యగా సరిపడుతుందా?" అంది పారిజాత.

"జాతా! నువ్వే చెప్పావు. పూల తీగనని! ఆ పూల తీగకు ఆసరా ఇవ్వడమే, వృక్షజాతికి సంతోషం. సృష్టికర్త అన్నిటినీ ఒకే దృష్టితో చూస్తాడు. ఒకదానికొకటి ఆలంబనగా బంధాన్ని కలుపుతాడు. ఇక నమ్మకం అంటావా! ఇంత

కాలంగా నీ ప్రతీ చర్యనూ నేను గమనిస్తూ వచ్చాను. అద్భుతమైన నీ సాహచర్యం, నాలో ఈ నిర్ణయానికి రూపమిచ్చింది. అయితే నీ వయసెంతో నాకు తెలియదు. నా వయసు అవసరం నీకు వుందంటే, నిరభ్యంతరంగా తెలియచెయ్!" అన్నాడు ఫణి.

"ఫణి బాబూ! వయసు ఏదైనా స్త్రీ పురుషులకు కావలసింది తోడు. ఒక భద్రత. కష్టసుఖాలు పంచుకునే స్నేహం" అంది పారిజాత.

"జాతా! నీలో ఇన్ని ఆలోచన్లు వున్నట్టు నాకు తెలియనే లేదు. నువ్వు కోరుకునేదీ, నేను ఆశించేదీ ఒక్కటే కనుక నా అభ్యర్థనను అంగీకరిస్తున్నావనే భావిస్తాను" అన్నాడు ఫణి, ఆనందంతో.

"ఫణి బాబూ! అంగీకరించకపోవడానికి నాకెవరు వున్నారని? అయితే నా భవిష్యత్ ఏమిటని నేను ఎన్నడూ దిగులు పడలేదు. ఏదో ఆత్మవిశ్వాసం ధైర్యాన్నిచ్చేది. ఆ నిశ్చింతే మీకు దగ్గిర చేసిందేమో!" అంది పారిజాత. అంతేకాదు. పెళ్ళినీ, వారసత్వం కావాలనీ ఆమె కోరలేదు. ఇన్నాళ్ళ సేవకు ప్రతిఫలంగా సెక్యూరిటీ ప్రాపర్టీ కావాలని అడగలేదు. అతని ఇష్టప్రకారం ఏం చేసినా సంతోషమేనంటూ చెప్పింది.

ఫణి చక్రవర్తి విష్ణుకి ఫోన్ చేశాడు. తన నిర్ణయాన్ని తెలియచేశాడు. "నాన్నగారూ! మీరు తీసుకున్న నిర్ణయం కంటే పారిజాత పిన్ని అంగీకారం నాకెంతో ఆనందాన్నిచ్చింది. నిస్వార్థమైన ఆమెలోని సేవాభావం నన్ను ముగ్ధుణ్ణి చేసింది. పిన్నితో మాట్లాడాలి ఫోన్ ఇవ్వండి" అన్నాడు సంతోషంతో.

"విష్ణూ! బాగున్నావయ్యా....?" ఆప్యాయంగా, ఎప్పటిలా అడిగింది పారిజాత.

"పిన్నీ! మెనీ మెనీ థాంక్స్. నాకెప్పుడూ నాన్నగారి గురించే చింత. నువ్వు చాలా గొప్ప దానివి పిన్నీ. వీలు చూసుకుని మీరిద్దరూ ఇక్కడకు రండి" అంటూ కృతజ్ఞత తెలియచేశాడు విష్ణు.

"థాంక్స్ చెప్పాల్సింది నేనయ్యా! మీరు మీ కుటుంబ సభ్యురాల్ని చేశారు. ఆత్మీయత పంచి ఇచ్చారు. ఇంతకన్నా ఏం కావాలి? నాన్నగారి బాధ్యత ఇక నుంచీ మరింత సంతోషంగా నిర్వహిస్తాను" అంది పారిజాత. అలాగే అయిదు సంవత్సరాల పాటు ఫణి చక్రవర్తితో, సహజీవనం గడిపింది పారిజాత! చివరి రోజులు ఆనందంగా, ఆరోగ్యంగా, ఉత్సాహంగా గడిచి పోతున్నందుకు, అందుకు కారణమైన పారిజాత పట్ల ఎనలేని అనురాగం కృతజ్ఞతా భావాలతో వుంటూ వచ్చాడు. సాధారణంగా భారతీయులు, ఏభై సంవత్సరాల స్త్రీని, అరవై సంవత్సరాల పురుషుణ్ణీ శారీరకంగా, నిస్సహాయులుగా భావిస్తారు. అంతే కాకుండా, మీరు విశ్రాంతి తీసుకోవాలంటూ, ఏ పని చెప్పడానికీ సంకోచిస్తారు. రిటైర్ అయ్యాక మానసికంగా కృంగిపోయేలా ప్రవర్తిస్తారు. అందులోనూ భార్యా వియోగంతో అలమటించేవారు ఒంటరిగా వుండలేక, కష్ట సుఖాలను పిల్లలతో పంచుకోలేక, దిగులుగా వుంటారు. అర్థం చేసుకుని, ఆదరించే చోట ఏదో ఒక వ్యాపకం కల్పించుకుని, సమాజ సేవ చేయడంలో ఆనందం పొంద గలిగేవారూ వుంటారు.

ఆరోగ్య స్థితి బాగుందని వారికి తప్పనిసరిగా ఒక తోడు అవసరం అవుతుంది. అలాంటి తోడు దొరికినప్పుడు, మానసికానందంతో పాటు, ఆయుః ప్రమాణం పెరిగి, ఉత్సాహంగా వుండ గలుగుతారు. మనస్తత్వవేత్తల పరిశోధనలో ఈ విషయం వెల్లడైంది. ఇప్పుడు, ఫణి, పారిజాతల పరిస్థితి ఇదే! అందుకే, విష్ణు ముందు చూపుతో, తెలివిగా పారిజాతను, తండ్రికి కేర్‌టేకర్‌గా నియమించి, తగిన ఫలితాన్ని చూశాడు. తండ్రి మరణించి, తల్లి ఒంటరిగా వుండాల్సి వస్తే, అప్పుడు కూడా ఇదే రకంగా, ఆవిడ జీవితానికి ఒక ఆలంబన చేకూర్చేవాడు.

అలా వీలున్నప్పుడు పారిజాత, ఫణి- విష్ణు దగ్గరికి వెళ్ళడమో, లేకపోతే విష్ణే వచ్చి, చూసి వెళ్ళడమో చేసేవాడు. ఒకసారి విష్ణు వచ్చినప్పుడు తండ్రితో చెప్పాడు.

"నాన్నగారూ! పిన్ని మీ నుంచి ఏమీ ఆశించక పోయినా, నాకూ నీ ఆస్తిలో వాటా పంచి తీరాలి... అని, అడగకపోయినా, ఆవిడ సేవకు ప్రతిఫలంగా, ఏదైనా కొంత ఆమె పేరున వ్రాయడం మంచిది. నా గురించి ఆలోచించకండి. ఈ ఇల్లు

పిన్ని పేర వ్రాయండి. పిన్నితో చెబితే అంగీక రించదు. విల్లు రాసి రిజిస్టర్ చేసి, ఆతర్వాతనే చెప్పండి" అన్నాడు ముందు చూపుతో!

ఒక్క క్షణం ఆలోచిస్తున్నట్టు వుండిపోయాడు ఫణి. విష్ణు చెప్పింది సబబుగానే వుంది. తన పరిస్థితి ఏరోజు ఎలా వుంటుందో. అయితే ఈ ఇల్లు విష్ణుకే ఇవ్వాలని అతడి తల్లి, పార్వతి అనేది. తాతగారి ఆస్తి కదా అని! కానీ, ఇప్పుడు విష్ణు, పిన్నికి ఇవ్వమంటున్నాడు. అందుకే కొంచెం ఆలోచనలో పడ్డాడు.

"విష్ణూ! ఈ ఇల్లు నీకు ఇమ్మని అమ్మ చెప్పేది. ఇదిలా వుంచి, దీనిపై వచ్చే ఆదాయం పిన్నికి ఇవ్వడం మంచిదేమో ఆలోచించు" అన్నాడు.

"లేదు నాన్నగారూ! ఏరోజు ఎవరి మనసులు ఎలా మారుతాయో... నేను చెప్పినట్టు ఇప్పుడే రాసివ్వండి" అన్నాడు విష్ణు.

ఫణి కొడుకు చెప్పినట్టే, లాయర్‌ని పిలిపించి, వ్యవహారమంతా, పూర్తి చేశాడు. అయితే మనిషి అనుకున్నది ఒకరకంగా, అనుకోనిది మరో రకంగానూ జరుగుతూ వుంటుంది.

మరో సంవత్సరానికి ఫణి చక్రవర్తి హార్ట్ ఫెయిల్యూర్‌తో మరణించడం, విష్ణు వచ్చి, ఆయన కోరిక ప్రకారం, తండ్రి శరీరాన్ని హాస్పిటల్‌కి డొనేట్ చేయడం, పిన్నికి ధైర్యం చెప్పి, ఇంటికి సంబంధించిన కాగితాలను, ఆమెకు ఇవ్వడం జరిగిపోయాయి.

పారిజాత, తండ్రీ కొడుకుల ఆత్మీయతకు కదిలిపోయింది. "విష్ణూ! ఇదేమీ న్యాయంగా లేదు. నాకు విలువ కట్టారా మీరు? నా గురించి తెలిసి కూడా ఇలా ఎందుకు చేశావ్ బాబూ..." అంది.

"పిన్నీ! నీకు విలువ కట్టడమా? ఎంత మాత్రమూ కాదు. నాన్నగారి గుర్తుగా ఏదో ఒకటి ఇవ్వాలన్న తపన మాత్రమే ఇది! మీరిద్దరూ పంచుకున్న అనుబంధానికి గుర్తుగా, సంతోషాన్ని మిగల్చాలని చేసిన చిన్న ప్రయత్నం. ఎప్పటిలా నా మీద అభిమానంతో వుండు చాలు. ఎప్పుడు ఏ అవసరం వచ్చినా నేను వున్నాను. ఎప్పుడు ఫోన్ చేసినా వచ్చి, తీసుకువెడతాను. ఈ ఇల్లు ఒక ప్రేమ మందిరం. ఇందులో వుండే అర్హత నీకు మాత్రమే వుంటుంది" అంటూ నచ్చచెప్పి, వెళ్ళిపోయాడు.

మంగ అనే అనాధ యువతికి ఆశ్రయం ఇచ్చి, తోడుగా వుంచుకుంది పారిజాత. కాలం బాగానే గడిచిపోతోంది.

"అక్కా! ఎలా వున్నావే. నీ కోసం వెదికి వెదికి చివరికి తెలుసుకోగలిగాను" అంటూ ఒక వ్యక్తి

## ఇలా చేసి చూడు...

ఎందుకలా నవ్వుతావ్?
ఎదురుగా నిలవలేక
కసికసిగా వెనక నుంచి నరికి
గెలిచానని వెర్రి నవ్వు నవ్వకు-
ఎందుకలా తెల్లబోతావ్?
తోటి మనిషి కాలు విరిచి
నువ్వే బాగా నడిచావని నవ్వకు
నవ్విపోతారు జనం-
ఎందుకలా చూస్తావ్?
పాడే కోకిల గొంతు నులిమి
నీ అరుపే పాట అని చాటుకోకు
నమ్మబోదు లోకం-
పైశాచిక కృత్యాలు చేసి పగలబడి నవ్వకు
నవ్వులపాలైపోతావ్
నమ్మిన నీవారినెపుడు
నాశనం చెయ్యబోకు
నీ నీడే నిన్ను వెంటాడుతుంది
నిలువ నీడ లేకుండా చేస్తుంది-
నీదే విజ్ఞత అని చాటుకోకు
నీ అజ్ఞానానికి గేలి చేస్తుంది ప్రపంచం
మానవత్వాన్ని మరిచిపోకు
మనుగడే మందగిస్తుంది
బతుకే శూన్యమవుతుంది
హత్య చెయ్యగానే సరా...
ఉరిశిక్షకు గురవవూ?
మమకారపు పందిళ్లు వేసుకో
మార్గం సుగమమవుతుంది
జీవితానికి పరమార్థం ఏర్పడుతుంది.

*-శారదా అశోకవర్ధన్*

చొరవగా వచ్చాడు ఇంట్లోకి.

పారిజాత అతణ్ణి గుర్తుపట్టింది. కానీ మాట్లాడలేదు. అతను పారిజాతకు తమ్ముడే! ఎవరికైతే దూరంగా వుండాలనుకుని వచ్చిందో, ఇన్నేళ్ళ తర్వాత అతడు తెలుసుకుని రావడం ఆనందానికి బదులు బాధ కలిగించింది. భయమూ కలిగింది.

"అలిగి ఇంట్లో నుంచి వెళ్ళిపోయావు. నేను కాదనుకోగలనా? అప్పట్నించీ వెదుకుతూ వున్నాను. పెళ్ళి చేసుకున్నావనీ, ఆయన ద్వారా ఆస్తి సంక్రమించిందనీ తెలిసింది. నా కంటే ఎంతైనా తెలివిగల దానివి. బ్రతుకు తెరువు తెలుసుకున్నావు. సుఖంగా వున్నావు. చూసి వెళ్ళాలని వచ్చాను" అన్నాడు అటూ ఇటూ కలయచూస్తూ, మంగ ద్వారా రామ్మూర్తి తన విషయాలన్నీ తెలుసుకున్నాడని, పారిజాతకు తెలియదు.

మంగ అమాయకంగా రామ్మూర్తి చెప్పినదంతా నమ్మింది. 'అక్క తన మీద కోపంతో వుందనీ, కాబట్టి, ఇలా కలుసుకున్నట్టు తెలియనీయవద్దనీ, ఒకరోజు నేనే వస్తాననీ' అన్నాడు. మంగ సరేనంది. అందుకే ముందుగా పారిజాతకు చెప్పలేదు మంగ.

"నువ్వు నా గురించి ఏం విన్నా, నిన్ను మాత్రం ఇక్కడ వుండనీయను. బాధ్యత తెలిసి, ఆదరించాల్సిన నువ్వు, జులాయిగా తిరుగుతూ, మళ్ళీ ఇక్కడికి దాపురించావు. నా మానాన నన్ను బతకనీయ్. వెళ్ళిపో" కోపంగా అంది పారిజాత.

## మానవత 'చిత్రం'?!

పొద్దు లేచింది మొదలు
కాగితాలకు కాగితాలు
నమిలేస్తున్న కలం...
కక్కినదంతా
కుక్కిన పేనులా పడివున్న
మానవతనే!

*-బోజంకి వెంకటరవి*

"నీ కంటే చిన్నవాడిని. నా బాధ్యత పెద్ద దానిగా నీదే! మీరిద్దరూ ఆడవాళ్ళు. ఈరోజుల్లో ఒంటిగా వుండటం మంచిది కాదు. నువ్వు కాదంటే మాత్రం రక్త సంబంధం తెగిపోతుందా? నేను ఇక్కడే వుంటాను" అన్నాడు మొండిగా రామ్మూర్తి. "వీల్లేదని చెప్పానుగా! వెళ్ళిపో. ఈ ఇల్లు నాది కాదు. ఏ క్షణంలో అయినా ఇంటి యజమాని వచ్చి, అందర్నీ వెళ్ళగొడతాడు. కొద్దికాలం నన్ను కనిపెట్టి వుండమంటే వున్నాను. పెళ్ళీ లేదు ఏమీ లేదు. నువ్వు తెలుసుకున్నదంతా నిజం కాదు" అంది పారిజాత, బుకాయిస్తూ.

"నువ్వెన్ని చెప్పినా నిజం నాకు తెలిసిపోయింది. నన్ను వెళ్ళగొట్టడం నీ తరం కాదు. అయినా అక్కయ్యా! నీ ఆనందానికి అడ్డురాను. తిండి పెట్టు. రోజుకి పది రూపాయలు ఇయ్యి చాలు. నీ స్టేటస్ పెరిగినా, తక్కువ దాంతోనే సరిపెట్టుకుంటాను" అన్నాడు పొగరుగా రామ్మూర్తి.

పారిజాతకు తెలుసు రామ్మూర్తి అంత సులువుగా వదిలే ఘటం కాదు. మెల్లిగా ఏదో ఒకటి ఆలోచించి పంపేయాలి. అంతవరకూ వీడితో గొడవ పెట్టుకునీ ప్రయోజనం లేదని, అప్పటికి వూరుకుంది. ఆ మెత్తదనమే తీరని నష్టం కలిగించింది.

పారిజాత మనసు మంచిది. ఏది చేసినా మంచిగానే ఆలోచిస్తుంది. అందుకే తనలాంటి మరో అనాథ మంగని చేరదీసింది. కానీ, అందరూ తనలాగే వుంటారని నమ్మడమే ఆమె చేసిన పొరబాటు. మంగ అమాయకురాలే... కానీ, వయసులో వుండే సహజమైన కోరికలు ఆ పిల్లని పెడదారిన పట్టించాయని, ఆలస్యంగా తెలుసుకుంది. పద్దెనిమిదేళ్ళ మంగకి, తగినవాడితో పెళ్ళి జరిపిస్తే, ఇద్దరూ తోడుగా వుంటారనుకుంది పారిజాత! మంగను చాటుగా పిల్చి, అశ్లీల సాహిత్యాన్ని బోధించి, మెల్లిగా తనవైపు తిప్పుకున్నాడు, టివిల్లో వచ్చే సినిమాలు, పాటలు, మంగని మరింతగా ప్రభావితం చేయడంతో, ఆ అమ్మాయి సులువుగా రామ్మూర్తి వలలో పడిపోయింది. ఒక మనిషిని బాగు చేయడమంటే కష్టం! చెడువైపు తిప్పడం చాలా సులువు. తిరుగుళ్ళకు అలవాటు

పడిన రామ్మూర్తికి మంగని దార్లోకి తెచ్చుకోవడం పెద్ద కష్టం కాలేదు. దానికితోడు పారిజాత హఠాత్తుగా అనారోగ్యం పాలవడంతో ఆమెకు రామ్మూర్తీ, మంగల ఆసరా తప్పలేదు. క్రమంగా పారిజాత మంచం పట్టింది. ఎంతైనా ఆదరించిన మనిషన్న కృతజ్ఞతతో పారిజాతను మంగ బాగానే చూసినా, రామ్మూర్తి వేధింపులు మాత్రం ఎక్కువయ్యాయి. ఇల్లు మా ఇద్దరి పేరునా రాయమని, సతాయించసాగాడు. తప్పనిసరి పరిస్థితుల్లో విష్ణుకి తెలియచేయలేని నిస్సహాయ స్థితిలో పారిజాత, 'మంగని పెళ్ళి చేసుకుంటే, ఇల్లు మీ పేర బదిలీ చేస్తానంది.'

'ఖర్చు లేని పసుపు కొమ్ముతో పెళ్ళికేం భాగ్యం? ఎన్ని పెళ్ళిళ్ళు అయినా చేసుకుంటా నంటూ' దేముడి ఫోటో ముందు ఆ తతంగం కానిచ్చేశాడు రామ్మూర్తి. ఆ ఇంటిని ఏ సదుద్దేశంతో విష్ణు తనకి ఇచ్చాడో గుర్తువచ్చి, దుఃఖం పొంగి వచ్చింది పారిజాతకు. కానీ ఇటువంటి నిస్సహాయ స్థితిలో దొరికిన ఛాన్స్‌ని రామ్మూర్తి వదలడు. తనను హత్య చేసి అయినా స్వాధీనం చేసుకోగలడు. అలా అని, ఇల్లు తీసుకుని, వుండనిస్తాడా అనేదీ అనుమానమే! రేపే దీన్ని అమ్మి, ఆ డబ్బుతో పరారీ కావడం ఖాయం అనీ ఆమెకు తెలుసు. చివరి ప్రయత్నంగా మంగతో చెప్పింది.

"మంగా! రామ్మూర్తిని గుడ్డిగా నమ్మావు. పెళ్ళిచేసి, నీకూ, నీ భర్తకీ ఈ ఇల్లు ఇవ్వాలని భావించాను. మీ దగ్గర నా జీవితం వెళ్ళిపోతుందని ఆశపడ్డాను. కానీ దుర్మార్గుడు రామ్మూర్తి ఆకర్షణలో పడి, నీ భవిష్యత్ అంతా నాశనం చేసుకున్నావు. నేను లేచి తిరగ్గలిగితే, ప్రమాదం నుంచి, నిన్ను తప్పించ గలిగే దాన్ని. ఇప్పుడు నా తరం కాదు. నిన్నూ వాడు శాశ్వతంగా భరించడు. వాడికి స్థిరత్వం లేదు. తోడబుట్టిన దాన్నని నా మీదా, నమ్ముకున్న దానివని నీ మీదా, ఏ మాత్రమూ ప్రేమాభిమానాలను చూపించలేడు. నువ్వు చేసిన చిన్నపొరపాటు మనిద్దర్నీ నిరాశ్రయుల్ని చేసింది. మంగా! చివరిసారిగా చెబుతున్నాను. వాడు పోతే పోనీ. నువ్వు మాత్రం వాడితో వెళ్ళకు. నిన్ను కూడా అమ్మకానికి పెట్టే నీచుడు. నా దగ్గర లాకర్‌లో కొన్ని నగలున్నాయి. మనం అవి తీసుకుని, దూరంగా వెళ్ళిపోదాం. చెప్పు. నాతో వస్తావా?" అంది.

అప్పటికే రామ్మూర్తి తాగి వచ్చి మంగని చితక బాదడం, త్వరలోనే నీ పీడ వదిలించుకుంటా నంటూ తిట్టడం, అక్క దగ్గిర నగలున్నాయా, డబ్బుందా, అంటూ ఆరాలు తీయడం అనుభవం అయిన మంగకి, ఆమె మాటలు కొండంత ఆశను నింపాయి. జరిగిన తప్పుకి పశ్చాత్తాపంతో, పారిజాత చేతులు పట్టుకుని విలపిస్తూ.

"అమ్మా! నేను చాలా పెద్ద తప్పు చేశాను. ఆశ్రయం ఇచ్చి, అన్నం పెట్టిన నీకే ద్రోహం చేశాను. శిక్ష అనుభవించాను. ఇక మీదట నిన్ను నా ప్రాణంగా చూసుకుంటాను. నువ్వు చెప్పినట్టే చేస్తాను. నీ దగ్గిరే వుంటాను. రామ్మూర్తిని విడిచి ఈరోజే వెళ్ళిపోదాం. చెప్పు. మనం ఏం చేద్దాం?"

## స్త్రీ

స్త్రీలో "మాతృత్వం"
మూర్తీభవిస్తుంది!
"ధరణి"లా "సహనం"
అధివసిస్తుంది!
"తరువు"లా–
అణువణువునా
"అనురాగం" పల్లవిస్తుంది!
తాను తినక, తాగక
తన "సంతానం కోసం
దాచి "త్యాగం"తో జీవిస్తుంది!
"వాత్సల్యామృతా"న్ని కురిపిస్తుంది!
అందుకే–
స్త్రీ ప్రేమైక మూర్తి!
త్యాగమయి!
అమృత కలశం!
సుందరనందనం!

–శ్రీవత్స

అంది మంగ.

"ఫణిబాబు గారి స్నేహితులు ఒక డాక్టర్ గారున్నారు. ఆయన వృద్ధాశ్రమం నడుపుతున్నారు. అందులో నన్ను చేర్చు. నువ్వు నర్స్‌గా అక్కడే పని చేయొచ్చు. నా తదనంతరం నీ జీవితమూ సుఖంగా గడిచిపోతుంది. ఈ విషయం పొరబాటున కూడా రామ్మూర్తికి తెలియకూడదు. వెళ్ళిన తర్వాత తెలిసినా ఫర్వాలేదు. ఏమీ చేయలేడు". పథకం వివరించింది పారిజాత.

తప్పతాగి ఇంటికి చేరుకున్న రామ్మూర్తికి, ఎవరూ కనిపించలేదు. కాస్సేపు అరచి, అరచి గోలచేసి, ఎప్పుడో నిద్రపోయాడు. మత్తు వదిలి తెల్లారి చూస్తే, మంగ, పారిజాతల సామాన్లు కనబడలేదు. 'ఇద్దరూ కూడబలుక్కుని పారిపోయారన్న మాట. పోతే పోనీ! ఇల్లు దక్కింది. ఓ శ్రమ తప్పింది' అనుకున్నాడు.

ఎన్నిసార్లు ఫోన్ చేసినా, ఫోన్ డిస్‌కనెక్ట్ అని రిప్లై రావడంతో, పిన్ని ఏమైందో అర్థం కాలేదు విష్ణుకి. తెలిసిన వాళ్ళ ద్వారా వాకబు చేస్తే, ఆ ఇంట్లో ఎవరూ లేరనీ, ఇల్లు అమ్మివేశారనీ, కొనుక్కున్న వారు, పాత ఇంటిని పడగొట్టి, ఏదో ఆఫీస్ కడుతున్నారనీ తెలిసింది. పిన్ని తనతో చెప్పకుండా ఇలాంటి పని చేయదనీ, కారణం ఏదో అర్థం కాక, ఎక్కడికి వెళ్ళిందో తెలియక బాధ పడ్డాడు. ఏదో పనిమీద ఇండియా వచ్చినప్పుడు, డాక్టర్ గారి దగ్గరకు వెడితే అప్పుడు తెలిసింది అతనికి.

"విష్ణూ! పారిజాత చివరి క్షణాల్లో వుంది. ఆమె చేరదీసిన మంగను పిలుస్తానుండు. మంగ జరిగిన విషయాలన్నీ వివరించింది. పారిజాత దగ్గరకు తీసుకువెళ్ళింది. కానీ పారిజాత స్పృహలో లేదు. ఆమె పరిస్థితి ఆరోజు మరీ దిగజారిపోయింది. మంగ, ఆమె చెవి దగ్గర 'విష్ణు వచ్చాడు... అమ్మా! విష్ణు వచ్చాడు'... అంటూ పిలిచింది. అయినా ప్రయోజనం లేకపోయింది.

"డాక్టర్! పిన్నికి ఈ దుస్థితి రాకూడదనే నాన్నగారు ఏర్పాటు చేశారు. కానీ ఆమెకు తప్పలేదు. అంతటి త్యాగమూర్తి, మంచి మనిషికీ ఏం కాకూడదని కోరుకున్నామో, అదే దాపురించింది. ఇంతటి నిస్వార్థమూర్తిని ఎక్కడా చూడం. నాన్నగారు మా దగ్గరకు రాలేదన్న దిగులు, పిన్నిని చూశాక మరచిపోయాం. ఆమె రుణం తీర్చుకోలేనిది. వివాహ బంధం లేకపోయినా ప్రేమానుబంధంతో సహ ధర్మచారిణిగా నాన్నగారికి ఎంతో సేవ చేసింది. ఆయన నిశ్చింతగా కన్నుమూశారు. మా అందరికీ ఆనందాన్నిచ్చిన పిన్ని మాత్రం, చాలా బాధలు పడింది" అంటూ పారిజాత గురించి మరీమరీ తలచుకుని విలపించాడు.

"ఊరుకో విష్ణూ! ఏం చేయగలం? నువ్వు, మీ నాన్నా- ఆవిడకు, ఆశ్రయం ఇచ్చారు. అర్హత కల్పించారు. సుఖ జీవనానికి ఏర్పాట్లు చేశారు. దుర్మార్గుడైన తమ్ముడు, అవసరానికి ఆశ్రయించి, కష్టాలపాలు చేశాడు. ఎవరూ చేయగలిగింది లేదు" అన్నాడు ఓదార్పుగా.

పారిజాతకి చివర్లో కొద్దిగా తెలివి వచ్చింది. విష్ణును చూసి ఆమె కళ్ళలో నీళ్ళు వచ్చాయి. తన అవసాన దశలో అతణ్ణి చూడగలిగాననే సంతృప్తికి ఆనవాలు అది! సన్నటి చిరునవ్వు పెదవుల మీద పరచుకుంది. అంతే, ఆమె ప్రాణాలు అనంత వాయువులో కలిసిపోయాయి. విష్ణు ఆమె కన్నబిడ్డ కాకపోయినా, అంతకన్నా ఎక్కువై అంత్యక్రియలు జరిపించాడు. ఎక్కడో పుట్టింది. నాన్నగారిని ఆదుకుంది. చివరికి త్యాగమూర్తిగా కళ్ళు మూసింది. మనస్ఫూర్తిగా శ్రద్ధాంజలి ఘటించి, ఆమె పేరున వృద్ధాశ్రమానికి కొంత సొమ్మును ఇచ్చాడు. భారమైన మనసుతో అమెరికా వెళ్ళిపోయాడు విష్ణు. ■

## పెళ్ళికొడుకు

ఎందరో అమ్మాయిలను చూసాను
అందరికీ వంకలు పెట్టాను
కానీ నిన్ను చూసిన తరవాత మాత్రం
అద్దంలో నన్ను నేను చూసుకున్నాను
ఏమైనా వంకలు పెడతారేమోనని
ఎంతో భయపడ్డాను.

-వి. శ్రీలక్ష్మి